

సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి

వికారాబాద్, మార్చి6 : జిల్లాలో జరిగే సీసీ రోడ్ల పనులు గడువులోగా పూర్తి చేయాలని, కలెక్టర్‌నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలతో టెలీకాన్ఫరెన్సు ద్వారా జిల్లాలో పనులను సమీక్షించారు. పూర్తి అయిన పనులను తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా చూడాలన్నారు.



అనంతగిరి కొండలు

తెలంగాణ ఊటీ.. పర్యాటక బ్యూటీ!

స్వదేశీ దర్శన్ 2.0లో అనంతగిరి

రూ.98 కోట్లతో అభివృద్ధి పనులు

- మొదటి ప్యాకేజీలో రూ.38 కోట్ల కేటాయింపు
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- వీక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- ప్రాజెక్టు గురించి వివరించనున్న పీడీఎంసీ అధికారులు
- కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులకూ పర్యాటక శోభ

లోతైన లోయలు.. వంపులు తిరిగిన రోడ్ల మలుపులు.. పచ్చని ప్రకృతి సౌందర్యం.. ఆహ్లాదకరమైన వాతావరణానికి నెలవు అనంతగిరులు.. ఈ ప్రాంతం చూడగానే ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. పక్షుల కిలకిలరావాలకు నెలవైన అనంతగిరి కొండలకు ఇక మహర్దశ పట్టనుంది. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి ఇక పర్యాటక బ్యూటీగా మారబోతోంది. కేంద్ర పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచనుంది. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ కొండల్లో 213 ఎకరాలను ఎకో టూరిజం (పర్యావరణ పర్యాటకం) జోన్‌గా తీర్చిదిద్దనున్నారు. అంతే కాకుండా సమీపంలోనే ఉన్న కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులనూ అభివృద్ధి పరచనున్నారు.

వారాంతపు విడిది కేంద్రం

అనంతగిరి కొండల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. రోజూ పని వత్తిళ్లతో మునిగితేలే ప్రజలు సేదతీరేందుకు అనంతగిరి కొండలు అనువైన ప్రాంతం. లోతైన లోయలు, వంపులు తిరిగిన రోడ్డు మలుపులు, పచ్చని చెట్ల సమూహాలతో అనంతగిరి కొండలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడి వాతావరణం చూడగానే ఆకట్టుకునేలా ఉండడంతో పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అనంతగిరిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్ నిర్మాణం చేపట్టారు. సందర్శకుల కోసం కాటేజీలు, స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మించారు. వారాంతంలో ఈ రిసార్ట్ సందర్శకులతో కిటకిటలాడుతుంది. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు రిజర్వు చేసుకుని ఇక్కడకు వస్తుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో ఒక్క కాటేజీ కూడా ఖాళీ ఉండదు. ఇంకా ఎక్కువ సంఖ్యలో విడిది కేంద్రాలు ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

వికారాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలను ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి పరిచే పనులు ఇక కార్యరూపం దాల్చబోతున్నాయి. కేంద్ర పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద అనంతగిరి కొండలను పర్యాటక పరంగా అభివృద్ధి పరచాలని నిర్ణయించింది. అనంతగిరి కొండలను ఎకో టూరిజంగా అభివృద్ధి పరిచే ప్రతిపాదనపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అనంతగిరి కొండల్లో 213ఎకరాలను ఎకో టూరిజం (పర్యావరణ పర్యాటకం) జోన్‌గా తీర్చిదిద్దనున్నారు. అంతే కాకుండా సమీపంలోనే ఉన్న కోట్‌పల్లి, సర్పన్ పల్లి ప్రాజెక్టులను పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. స్వదేశీ దర్శన్ పథకం కింద అనంతగిరి కొండలను రూ.98 కోట్లతో ఎకో టూరిజం జోన్‌గా అభివృద్ధి చేయనున్నారు. మొదటి ప్యాకేజీలో రూ.38 కోట్లతో ఎకో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కాగా, ఈ రెండు ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం పర్యాటక శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. అనంతపద్మనాభ స్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయాల పరిసరాలనూ అభివృద్ధి పరిచే పనులు కూడా స్వదేశీ దర్శన్ కింద చేపట్టనున్నట్లు తెలిసింది.



జలపాతం (ఫైల్)

ఎల్‌అండ్‌టీ సంస్థకు అభివృద్ధి బాధ్యతలు

అనంతగిరిని ఎకో టూరిజంగా అభివృద్ధి పరిచే పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ పర్యవేక్షిస్తోంది. ప్రణాళిక రూపకల్పన, అభివృద్ధి పరిచే బాధ్యతలను ప్రభుత్వం ఈ సంస్థకు అప్పగించింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీనగర్ నుంచి వర్చువల్‌గా ఈ పనులను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా అనంతగిరి కొండలను ఎకో టూరిజంగా ఏ విధంగా అభివృద్ధి పరచనున్నారనేది స్థానికంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో ప్రాజెక్టు డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పీడీఎంసీ), పర్యాటక శాఖ అధికారులు వివరించనున్నారు.

వేల సంఖ్యలో సందర్శకులు

అనంతగిరి కొండలు రాష్ట్ర రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య వేలల్లో ఉంటోంది. వారాంతాల్లో 5 వేల నుంచి 10వేల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. వర్షాకాలంలో ఈ తాడికి మరింత అధికంగా ఉంటుంది. పర్యాటకుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. కాటేజీలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్, రోడ్లు, పార్కింగ్, ట్రాకింగ్ పాయింట్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించనున్నారు. అంతే కాకుండా ట్రెక్కింగ్, రోప్‌వేస్,. వ్యూపాయింట్, పార్కులు ఏర్పాటు చేస్తారు. రాత్రివేళలో వెయ్యి మంది పర్యాటకులు అనంతగిరిలో బస చేసే విధంగా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోన్నారు. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులనూ పర్యావరణ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరచనుండడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా, అనంతపద్మనాభ స్వామి దేవాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.200 కోట్లతో ప్రణాళికలు రూపొందించినా అవి ప్రతిపాదనలకే పరిమితమైన విషయం తెలిసిందే. .



నందిఘాట్

ఎడ్వంచర్ టూరిజానికి అనుకూలం

అనంతగిరి అటవీ ప్రాంతంలో 1,654 హెక్టార్లలో అపారమైన ప్రకృతి సంపద, ఔషధ మొక్కలున్నాయి. వివిధ వన్యప్రాణులు, వందల రకాల పక్షులు, రకరకాల సీతాకోక చిలుకలున్నాయి. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు జంగిల్ రిసార్ట్‌తో పాటు ఎడ్వంచర్ టూరిజం అభివృద్ధి పరిస్తే పర్యాటకులు పెరగనున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా, సందర్శకులకు ఆహ్లాదం, ఆరోగ్యం పంచే ప్రాంతంగా పేరొందిన అనంతగిరి కొండలను వివిధ రకాల సాహస కృత్యాలకు నిలయంగా మార్చితే పర్యాటకుల సంఖ్య పెరగనుంది. స్థానికులకూ ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయి. మౌంటెన్ క్లైంబింగ్, రాక్ క్లైంబింగ్, డిర్ట్ బైక్స్, సైకిల్ ట్రాప్, జిప్‌లైన్స్, నేచర్ ట్రెక్కింగ్, స్కై డైవింగ్, బ్యాక్ బ్యాకింగ్, క్యాంపింగ్, హైకింగ్, హార్స్‌బ్యాక్ రైడింగ్, స్కూబా డైవింగ్, సర్ఫింగ్, బర్డ్‌వాచింగ్, ఎకో టూరిజం, కెనోయింగ్, రివర్ క్రాసింగ్, అడ్వెంచర్ క్లబ్ వంటివి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే అనంతగిరి రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.



అనంతపద్మనాభ స్వామి ఆలయం

జల్సాలకు అలవాటై.. గంజాయి విక్రయించిన విద్యార్థులు

- పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు..
- మూడున్నకిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి6: జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను పట్టుకున్న ఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘట్‌కేసర్ మండలం, అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరేందర్(19), విద్యాన్‌సింగ్(19), మరో వ్యక్తి సాయికుమర్‌తో కలిసి వెంకటాపూర్‌లోని ఎమరాల్డ్ టవర్ బీ-బ్లాక్‌లో అద్దెకు ఉంటున్నారు. ఆ ముగ్గురు కలిసి గంజాయిని ఘట్‌కేసర్ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు వారుంటున్న ఇంటిపై దాడి చేయగా మూడున్నర కిలోల గంజాయి పట్టుబడగా స్వాధీనం చేసుకున్నారు. నరేందర్, విద్యాన్ సింగ్‌లను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి సాయికుమార్ పరారయ్యాడు. విద్యార్థులను విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఘట్‌కేసర్ ప్రాంతంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి, త్వరగా డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయిస్తున్నట్లు విద్యార్థులు చెప్పారని అన్నారు. మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు, పరారీలో ఉన్న సాయికుమార్‌ను త్వరలో పట్టుకోనున్నట్లు సీఐ రవి తెలిపారు.



పోలీసుల అదుపులో విద్యార్థులు

ప్రతి ఒక్కరికీ ధ్యానం అవసరం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, మార్చి 6: ప్రతి ఒక్కరికీ ధ్యానం అవసరమని, కర్ణాటక రాష్ట్రంలో విద్యార్థులకు ధ్యానం నేర్పించడం జరుగుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం ఈశ్వరీయ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా వికారాబాద్‌లో ద్వాదశ జ్యోతిర్లింగ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణలో కూడా పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానం నేర్పించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక అలవర్చుకొని ప్రశాంతమైన జీవితం గడుపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మంజుల, నాయకులు ఎర్రవల్లి జాఫర్, మహిపాల్‌రెడ్డి, కిషన్ నాయక్, ముత్తహార్ షరీఫ్, గోపాల్, బ్రహ్మకుమారి మధు అక్కయ్య, నిర్వాహకులు నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అంతే కాకుండా వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సమీపంలో 27వ వార్డు కౌన్సిలర్ సురేష్ తనయులు రాకేష్, రాహుల్ నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌జోన్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

మూడుచింతలపల్లి, మార్చి6 : సాగులో ఆధునిక, సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 110 మంది రైతులకు శ్రవణ, దృశ్య విధానంలో అవగాహన కల్పించేందుకు మూడుచింతలపల్లి రైతువేదికగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సాగులో ఆధునిక, సాంకేతిక విధానాలపై అవగాహన, ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ అఖిలేష్‌రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ మేరీరేఖ, ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, వజ్రేష్‌యాదవ్, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి ప్రభాకర్, రైతులు



అధికారులతో కలిసి స్థలపరిశీలన చేస్తున్న కలెక్టర్ గౌతమ్

సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన

మేడ్చల్‌టౌన్, మార్చి 6: ఈనెల 9న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో సీఎం సభా ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షించారు. ఐటీ టవర్ ప్రాంతంలో డ్వాక్రా మహిళలతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమానికి సంబంధించిన పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలోని మండలాలతో పాటు మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. బహిరంగసభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. వేదిక ఏర్పాటు బాధ్యతను రెవెన్యూ అధికారులకు ఇవ్వగా, సభ నిర్వహణ బాధ్యతలను మెప్మా, మహిళా సంఘాల ప్రతినిధులకు అప్పగించాలని సూచించారు. దీనికి తోడు భద్రతా ఏర్పాట్లతో పాటు వాహనాల పార్కింగ్, వీఐపీల గ్యాలరీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభా సమయం ఖరారు కాగానే అధికారులు అప్పగించిన బాధ్యతలను వేగంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంకురార్పణ

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి
- ఆరు రోజుల పాటు స్వామివారికి సేవలు, వైదిక పూజలు
- నేడు స్వామివారి కల్యాణమహోత్సవం

కీసర, మార్చి 6: కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ అధ్వర్యంలో వేదపాఠశాల పండితుడు గణపతిశర్మచే గణపతిపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచనము, రుత్విక్‌వరణము, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపన, అగ్నిప్రతిస్థాపన, బేరిపూజ ధ్వజారోహణ, ద్వాత్రిశంతి, రాగాలవన, హారతి, మంత్రిపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం తదిర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను కీసరలోని వంశపారంపర్యంగా వస్తున్న నివాస గృహానికి తీసుకెళ్లారు.



అంకురార్పణ చేస్తున్న నాగలింగం శర్మ, ఎమ్మెల్యే మల్లారెడ్డి

రూ. కోటి నిధులు కేటాయింపు

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం రూ. కోటి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరమున్నా ఆలయనిర్వాహకులు, కలెక్టర్ సమన్వయంతో నిధులను వినియోగించనున్నారు.

అన్నదాన సత్రాలు ప్రారంభం

ఆరురోజుల పాటు జరిగే జాతరకు లక్షల మంది విచ్చేస్తుంటారు. భక్తులతో పాటు అధికారులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులు, ఇతర శాఖలకు చెందిన ఎంతో మందికి భోజన వసతి కల్పించారు. ఆర్యవైశ్య నిత్యాన్నదానం సత్రం, రెడ్డిసంక్షేమ సంఘం అధ్వర్యంలో అన్నదాన సత్రాలను ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ, జడ్పీ వైస్‌చైర్మన్ పూస వెంకటేష్, సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ శర్మ, ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘబహుళ ద్వాదశి గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, రుద్రాస్వాహాకార హోమం, బిల్వార్చన, ప్రదోషకాల పూజ, మంత్రిపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాదం వితరణ చేయనున్నారు. శ్రీరామలింగేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను కీసర గ్రామం నుంచి నడకదారి గుండా పల్లకీలో కీసరగుట్టకు తీసుకురానున్నారు. శ్రవణ నక్షత్రయుక్త లగ్నమందు శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

రాజీనామా

తాండూరు, మార్చి 6: బీఆర్ఎస్ తాండూరు మహిళా విభాగం అధ్యక్షురాలు జి.పరిమళ ఆ పార్టీ, పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌కు రాజీనామా లేఖను పంపించారు

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

దోమ, మార్చి 6: రైతులకు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో బుధవారం ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, ఏఈవోలు పాల్గొన్నారు.



గూడూరులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తనిఖీ

ముదిరాజ్ మండల కమిటీలు వేయాలి

వికారాబాద్, మార్చి 6: ప్రతీ మండలంలో ముదిరాజ్ మండల కమిటీలు వేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.వీరప్ప ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బని బసయ్య ముదిరాజ్ కోరారు. జిల్లాలోని మండలాల ముదిరాజ్, కన్వీనర్లు బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మైపాల్, అంబదాసు, అశోక్, కృష్ణ, జర్నప్ప, రాములు, తిరుపతి పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘం సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు

ఉద్యోగులకు బదిలీలు సహజం

వికారాబాద్, మార్చి 6 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళుతున్న వికారాబాద్ డీఎస్పీ పనిచేసిన అంజయ్య, కొడంగల్ సీఐగా పనిచేసిన రాములు, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రవికుమార్‌లను బుధవారం ఎస్పీ ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన పోలీసు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేసి పోలీసు వ్యవస్థకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.


డీఎస్పీ అంజయ్యను శాలువాతో సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

తాగునీటి సమస్యలు రానివ్వద్దు : ఎంపీపీ

మాడ్గుల, మార్చి 6 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు ఎంపీపీ గౌరవరం పద్మ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి, పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పాండుగౌడ్, గ్యార వెంకటయ్య, నారమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో సరస్వతి, పీఆర్‌డీఈ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ఏఈ సూర్యవంశీ, విద్యుత్తు ఏఈ శ్రీనివాస్, ఏవో గౌతం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

అంతరించిపోతున్న కళలను పరిరక్షించాలి

ఆమనగల్లు, మార్చి 6: అంతరించిన పోతున్న గ్రామీణ కళలు, కళారూపాలను పరిరక్షించాలని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆ కళాకారులకు ప్రభుత్వాలు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీలక్ష్మీనర్సింహా స్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. కళాకారులకు ప్రోత్సాహకంగా రూ.10 వేలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నిర్వాహకుడు నారాయణ, ఎంపీటీసీ అంబాజీ, నాయకులు బాలకృష్ణ, అజీజ్, విష్ణువర్ధన్ యాదవ్, పెంటయ్యగౌడ్, శ్రీరామ్, లింగం, కృష్ణయ్య, పాల్గొన్నారు.

మహిళగా జన్మించడం అదృష్టం : గవర్నర్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళగా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్‌పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మహిళలను గౌరవించే ఏ దేశమైన అభివృద్ధి చెందుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. జీవితంలో మహిళలు ఒక తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలిగా ఎన్నో పాత్రలు పోషిస్తున్నారని మహిళల్లో నిబద్ధత ఎక్కువని అభిప్రాయపడ్డారు. తన జీవితంలో రంగు, ఎత్తు, ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అనుభవాలను వివరించారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరిలో గవర్నర్‌గా అవకాశమిస్తే రెండు చోట్లా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తున్నానని, ఒక గైనకాలజిస్ట్‌గా పిల్లలను ఎలా పెంచాలో తెలుసని ఆమె అన్నారు. అదేవిధంగా మహిళలు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సీపీ తరుణ్‌జోషి, పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఐపీఎస్ అభిలాష బిస్త్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, అడ్మిన్ డీసీపీ ఇందిర, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్, బాలీవుడ్ నటి తనాజ్ ఇరానీ, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, జవహర్‌నగర్ సీఐ నాగరాజు, డీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

బీజేపీతోనే దేశాభివృద్ధి : ఈటల

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 6 : బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని ఎదులాబాద్, ఘణపురం, ప్రతాప్‌సింగారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో శామీర్‌పేటలోని ఆయన నివాసంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని తెలిపారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కంట్లం చెన్నప్ప, ఎర్రోళ్ళ మురళి, సుంకరి బాబు, జనార్దన్, మహేష్, నాగరాజ్, ప్రభాకర్, భాస్కర్, వికాస్, ధీరజ్ తదితరులు బీజేపీలో చేరగా, బీజేపీ మండల కార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, రాచకట్ల శ్రీశైలం, నాయకులు దామోదర్‌రెడ్డి, ఎర్రోళ్ళ కుమారస్వామి, మల్లేష్, భాస్కర్‌గౌడ్, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

పోలోలో అమెరికా చేతిలో భారత్ ఓటమి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాధా టీఎంటీ అంతర్జాతీయ పోలో చాంపియన్‌షిప్ మూడోరోజు పోటీల్లో అమెరికా చేతిలో భారత్ పరాజయం పాలైంది. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ హెచ్‌పీఆర్‌సీలో జరుగుతున్న ఈ పోటీల్లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో అమెరికా 10-6తో భారత్ జట్టుపై నెగ్గింది. అంతర్జాతీయ పోలో పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇస్తుండడం, ఇందులో తాము భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందని రాధా టీఎంటీ చైర్మన్ సునీల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీలు ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయి.



గోల్ కోసం పోటీపడుతున్న జట్లు

'గాంధీ'లో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

● ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యబృందం

అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి చిన్నపిల్లల వైద్యుల బృందం శస్త్ర చికిత్స చేసి విజయం సాధించారు. చిన్నపిల్లల విభాగంతో హెచ్‌వోడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి బైరాంగూడకు చెందిన మైథిలి(8) కొంత కాలంగా దగ్గు, తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. వ్యాధి ఎంతకూ తగ్గకపోవడంతో ఈనెల 1న కుటుంబ సభ్యులు గాంధీలో చేర్పించారు. చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ నాగార్జున వెంటనే స్పందించారు. చిన్నారి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు మొదటగా నిర్ధారణకు వచ్చారు. బ్రోంకో జెనిక్ తిత్తి అనేది అరుదైన సెప్టిక్ గాయం లాంటిదని వారు తెలిపారు. కాగా, అది క్రమంగా బ్రోంకోజెనిక్ తిత్తి పెరుగుతుందే తప్పా.. తగ్గదని భావించామని అన్నారు. చిన్నారిలో శ్వాసనాళం, ఛాతిలోని రక్తనాళాళ మధ్య శ్వాసనాళానికి దగ్గరగా కుడి ప్రధాన శ్వాసనాళం ప్రాంతంలో బ్రోంకోజెనిక్‌తో బాధపడుతుందని వైద్యులు నిర్ధారించారు. సూపరింటెండెంట్, ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

వికారాబాద్, మార్చి 6 : 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని, నాయకులు, రాజకీయ ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఓటరు ముసాయిదా తుది జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ముసాయిదాను విడుదల చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 1400 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలులేవని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోదల్చిన వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత కార్డు స్థానంలో నూతన కార్డు పొందేందుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్నట్లయితే పోస్టల్ ద్వారా కలర్‌తో కూడిన ఎపిక్ కార్డును పొందవచ్చని తెలిపారు. జిల్లాలో తుది చివరి ప్రచురణలో 9,84,068 మంది ఓటర్లున్నారని, ఇందులో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది స్త్రీ ఓటర్లతో పాటు 39 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లకుగాను 1,33,625, మంది పురుషులు, 1,32,639 మంది స్త్రీలు, 9 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లు ఉన్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు నమోదు కాగా.. 1,15019 మంది పురుషులు, 1,16,647 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. తాండూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,849 ఉండగా 1,18,228 మంది పురుషులు, 1,25,614 మంది స్త్రీలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. అదే విధంగా కొడంగల్ నియోజకవర్గంలో 2,42,267 మంది ఓటర్లలో 1,19,237 పురుష ఓటర్లు కాగా, 1,23,020 మంది స్త్రీ ఓటర్లతో పాటు 10 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందన్నారు. ఎన్నికల విభాగం తహసీల్దార్ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో నమ్రత సందడి

శంకర్‌పల్లి, మార్చి 6 : సినీనటి, మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సంద డి చేశారు. మండల పరిధిలోని గోపు లారం రెవెన్యూ పరిధిలో రెండున్నర ఎకరాల భూమిని నమ్రత కొనుగోలు చేశారు. భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ సురేందర్ సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రెండుగంటల పాటు నమ్రత అక్కడే ఉండటంతో ఆమెను చూసేందుకు మహేశ్‌బాబు అభిమానులు వచ్చి ఫొటోలు, సెల్ఫీలు దిగారు.



పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

● డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 6: అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుదలతోనే పని చేసిన విధంగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీ గెలుపునకు కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పరిగిలో జరిగిన నియోజకవర్గస్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఐదు నెలల వరకు కనీసం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంతోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు 24 గంటలూ పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రప్రథమంగా ప్రతీ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యకర్తలకు పనితోపాటు, ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు సంపూర్ణంగా అమలు చేస్తామన్నారు. ఈనెల 11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని, ప్రతీ నియోజవర్గానికి మొదటి దశలోనే 3500 ఇళ్ళు నిర్మించబోతున్నామని కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా గెలిపించేందుకు ఇప్పటినుంచే పని చేయాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఇమడలేకనే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ తీసుకోచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. వందరోజుల పాలనలో అన్ని హామీలను నేరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. గత ప్రభుత్వం జిల్లా అభివృద్ధిని విస్మరించిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అనేకమార్లు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, అందుకే పార్టీలో చేరామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన ఇందిరమ్మ కమిటీల ద్వారా సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చే నిర్ణయం చాలా మంచిదన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, లాల్ కృష్ణప్రసాద్, కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి హన్మంత్, ఆనందం, జింకల యాదయ్య కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్,గండీడ్, మహ్మదాబాద్ మండలాల పార్టీ అధ్యక్షులు బి.పరుశరాంరెడ్డి, సురేందర్, విజయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, కేఎం నారాయణ, పి.నర్సింహారావు, ఎ.అశోక్‌కుమార్, పరిగి పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు డి.మాణిక్యం, ఆనెం ఆంజనేయులు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

భూ సమస్యల పరిష్కారానికే 'స్పెషల్ డ్రైవ్'

మర్పల్లి, మార్చి 6: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ధరణి పెండింగ్ సమస్యలపై రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

మోమిన్‌పేట్ : ధరణిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసారం గ్రామంలో భూ సమస్యలు ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన దరఖాస్తులు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 9 వరకు మండల కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండటంతో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మీ సేవలో ధరణి దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్, విరాసత్‌లు, డీఎస్ పెండింగ్, పేరు మార్పులు, చేర్పులు, సర్వే నెంబర్లు ఎక్కువ, తక్కువ ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ జగన్‌యాదవ్, సర్వేయర్ గౌస్‌బాషా, రాందాస్, జూనియర్ అసిస్టెంట్లుఉన్నారు.


మోమిన్‌పేట్ : రికార్డులను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

నిర్ణీత గడువులోగా భూ సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్ రూరల్ : ధరణి స్పెషల్ డ్రైవ్ కింద రైతుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులకు సంబంధించి సమస్యలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణిపై నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్‌లో నిర్దేశిత సమయంలో ధరణి మాడ్యూల్స్ ప్రకారమే చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ డీఎస్ రజిని, డీటీ సందీప్‌రెడ్డి, ఆర్ఐలు పద్మనాభచారి, సాయిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్ : మాట్లాడుతున్న విజేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

షాద్‌నగర్, మార్చి 6 : నియోజకవర్గ పరిధిలోని కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో పాటు కొందుర్గు మండల సింగిల్‌విండో చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వీర్లపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి ఎంతోమంది నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కలిసికట్టుగా క్షేత్రస్థాయిలో పని చేస్తామని చెప్పారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.


దామోదరరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు

భూకైలాస్ ఆలయం ముస్తాబు

● సొరంగమార్గం ద్వారా జ్యోతిర్లింగాల దర్శనం
● నూతనంగా 18 శక్తిపీఠాల ఏర్పాటు
● శనైశ్వర, రేణుకా ఎల్లమ్మ, బుద్ధ విగ్రహాల ప్రతిష్ఠాపన
● ఈనెల నేటి నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు

తాండూరు రూరల్, మార్చి 6 : తాండూరు మండలం అంతారం తండాలో అద్భుతంగా నిర్మించిన భూ కైలాస్ దేవాలయం స్వర్గధామంగా విరాజిల్లుతోంది. ఇక్కడి అందాలను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. భక్తి పారవశ్యంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతగానో ఆకర్షిస్తుంది. అంతారం తండాలోని 10 ఎకరాల విస్తీర్ణంలో కోట్ల రూపాయలతో భూకైలాస్ దేవాలయాన్ని తండాకు చెందిన సేవ్యానాయక్(కీర్తిశేషులు) వంశం జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆల్ ఇండియా బంజారా యూనియన్ ప్రతినిధులు వాసుపవార్ నాయక్, శంకర్‌నాయక్‌లు ఆలయాన్ని నిర్మించారు. అందమైన గుడి గోపురాలు, మైమరిపించే బృందావనం సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. హైదరాబాద్‌తోపాటు జిల్లాలోని నలుమూలల నుంచి అనేక మంది భూకైలాస్‌కు తరలి వస్తున్నారు. ఈనెల 8వ తేదీన జరిగే మహాశివరాత్రికి ఇక్కడ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. నెల రోజులుగా వాసుపవార్ నాయక్ అక్కడే ఉండి నూతనంగా 18 శక్తి పీఠాలు, నవగ్రహాల ప్రతిష్ఠాపన, శనైశ్వర, రేణుకా ఎల్లమ్మ విగ్రహాలు, కోనేరులో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న రుద్రహోమం, 8న రుద్రాభిషేకం, చండీయాగం, అగ్నిగుండ ప్రవేశం, బోనాల ఊరేగింపు, పల్లకిసేవా, 9న ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం, 10న ముగింపు కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యాలు, తీర్థ ప్రసాదాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.


అంతారంతండాలోని భూకైలాస్ దేవాలయం

ఒకేచోట జ్యోతిర్లింగాల ఏర్పాటు

దేశంలో అత్యంత పవిత్రమై ద్వాదశ జ్యోతిర్లింగాలు భూకైలాస్‌లో దర్శనమిస్తాయి. సొరంగ మార్గం ద్వారా నీటిలో ముందుకు సాగుతూ ఒక్కో లింగాన్ని దర్శించుకునేలా వీలు కల్పించారు. నడుము మట్టం నీటిలో ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం మధురానుభతినిస్తుందని ఇక్కడికి వచ్చే భక్తులు పేర్కొంటున్నారు.

65 అడుగుల శివుడి విగ్రహం

భూకైలాస్ ఆలయానికి 65 అడుగుల శివుడి విగ్రహం తలమానికమైంది. కళాకారులు ఎంతో శ్రమించి భారీ ఎత్తున విగ్రహాన్ని చెక్కారు. భూకైలాస్‌కు వచ్చే భక్తులు భారీ శివుని విగ్రహం చూసి ఆశ్చర్యపోతున్నారు. అదేవిధంగా భూకైలాస్‌లో హిందువులు పూజించే దేవుళ్లను ప్రతిష్ఠించారు. అంబా భవానీ, సేవాలాల్ మహరాజ్ ఆలయం, కాళీమాత మందిరం, వేంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, వినాయకుడు, సాయిబాబా తదితర దేవతా మూర్తులను ఇక్కడ దర్శించుకోవచ్చు. అదేవిధంగా నిరంతరం మండే అగ్నిగుండంను అంబా భవానీ, సేవాలాల్ దేవాలయం ముందు ఏర్పాటు చేశారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి నేటి వరకు నిరంతరంగా అగ్నిగుండం వెలుగుతూనే ఉండటం మరో విశేషం. అలాగే భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. ఆలయంలో నూతనంగా 18శక్తి పీఠాలతోపాటు నవగ్రహాలు, శనైశ్చరుడు, రేణుకా ఎల్లమ్మ దేవతా విగ్రహం ముందు పాదాలు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా అమ్మవారి విగ్రహం ఎదుట మూడు త్రిశూలాలు ఏర్పాటు చేశారు. భక్తులు మనస్సులో కోరిక కోరుకుని గాజు వేస్తే అది త్రిశూలానికి పడితే వారి కోరిక తీరుతుందని ప్రగాఢంగా నమ్ముతారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన శక్తిపీఠాలు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

ఆలయంలో కొత్తగా మరిన్ని దేవతల విగ్రహాలను ఏర్పాటు చేశాం. మహా శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. భక్తుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. శివుడి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఈసారి పెద్దఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉంది.



- వాసుపవార్ నాయక్, ఆలయ వ్యవస్థాపకులు

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు


ఘట్‌కేసర్: పోచారంలోని స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

ఘట్‌కేసర్, మార్చి 6: పోచారంలో గల సర్వ మంగళసమేత స్పటిక లింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి పూజలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ధ్వజారోహణం పూజల్లో పాల్గొన్నారు. పూజారులు ఆయనను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా స్వామివారికి సుప్రభాతసేవ, మంగళధ్వని, గోపూజ, పుష్కరిణి పూజ, మహాన్యా పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, లక్ష్మీగణపతి హోమం వంటి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు చెరుకు సరితాభద్రీనారాయణగౌడ్, కౌన్సిలర్ మమతాజగన్ మోహన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, శేఖర్, బుచ్చిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. గురు, శుక్ర, శనివారాల్లో ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. 41 రోజులుగా పాంబండ శివస్వాముల శివనామస్మరణతో మారుమోగింది. శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఉపవాసాలు ఉండే భక్తులు పాంబండపై జాగారం చేయనున్నారు. పాంబండ దేవాలయానికి రంగులు వేయిస్తున్నారు.


యాలాల: జుంటిపల్లి రామస్వామి దేవాలయం

జుంటుపల్లి రామస్వామి ఆలయంలో..

యాలాల: మహాశివరాత్రిని పురస్కరించుకుని జుంటుపల్లి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ హనుమంతరావు దేశ్‌ముఖ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన ఉదయం ధ్వజారోహణం, వాహన సేవ, మహాశివరాత్రి రోజు ఉదయం 5గంటలకు రుద్రాభిషేకం, 9గంటలకు రుద్ర హోమం, పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

జీవన్గి మహాదేవలింగేశ్వరాలయం జాతర షురూ

బషీరాబాద్: మండలంలోని జీవన్గి కాగ్నానది ఒడ్డున వెలసిన శ్రీమహాదేవలింగేశ్వరాలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈజాతరకు ఏటా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈమేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 7న స్వస్తిపుణ్యావచనం, ధ్వజారోహణ నందీసమారధన, అంకురార్పణ, నవగ్రహపూజ, హోమం, మంటపదేవత పూజ, వెండి పల్లకీసేవ కార్యక్రమాలు, 8న ఏకాదశరుద్రాభిషేకం, బిల్వార్చన, లింగోద్భవ సమయం వరకు శివపూరణ కథాకాలక్షేపం, తెల్లవారుజామున 5గంటలకు శివభక్తులు, శివాచార్యులతో అగ్నిగుండ మహోత్సవం, 9న మధ్యాహ్నం 3.15 గంటలకు శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం రథోత్సవం(తేరు), అన్నదాన కార్యక్రమాలు, 10న కుస్తీపట్ల ఆటలపోటీలు, ప్రసాద వితరణ, అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ ఉత్సవాలకు స్థానికులతో పాటు కర్ణాటకలోని గుల్బర్గా, సేడం, అయ్యాలం, మదికంటి, చిత్తాపూర్, మల్‌ఖేడ్, షాబాద్, జెట్టూరు, నిడిగుంది తదితర గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు.


బషీరాబాద్: జీవన్గిలో జాతర ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ మహాదేవలింగేశ్వరాలయం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

తాండూరు రూరల్: మండలంలోని గోనూర్ గ్రామంలోని శివాలయంలో నందీ విఘ్నేశ్వర విగ్రహాల స్థాపనలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దత్తాత్రేయ రావు ప్రభావతి, కట్టెల శ్రీనివాస్ మహదేవి, మహేశ్వర్‌రెడ్డి సువర్ణ, నర్సింహులు ఇందిరా దంపతులు హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాఘవేంద్ర పంతులు బృందం విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ధ్వజారోహణం, గోపూజ, జలాదివాసం, రుద్రాభిషేకం, విగ్రహాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేశారు.


తాండూరు రూరల్: గోనూర్ శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి


పరిగి: బస్టాండ్ దగ్గర జరిగిన బీఆర్ఎస్ ధర్నాలో మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరిగి, మార్చి 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేఅవుట్ రిజిస్ట్రేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పరిగి బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్ ఉండదని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ కట్టాల్సిందేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. ఈ ధర్నాలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు బి.ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్‌వైఎస్ చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు పీరంపల్లి రాజు, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: కాంగ్రెస్ సర్కార్ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి డబ్బులు లాగే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, కృష్ణ, రామస్వామి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సుందర్ అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, రాజమల్లయ్య, రాజు నాయక్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తాండూరు పట్టణం బస్టాండ్ సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దీప నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీణ శ్రీనివాస చారీ, కౌన్సిలర్లు సంగీత ఠాకూర్, శోభారాణి, మాజీ కౌన్సిలర్ అనురాధ పాల్గొన్నారు.

కొడంగల్: ఎన్నికల సమయంలో ఎల్ఆర్ఎస్ ఉచితమని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్‌కు ఫీజు అనడం సరైంది కాదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క మాటలు ఉత్తి మాటలేనా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవడం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించడం తగదన్నారు. అదేవిధంగా దుద్యాల మండలంలోని పోలెపల్లి, హకీంపేట, లగచర్ల, ఈర్లపల్లి తదితర గ్రామాలకు ఫార్మా కంపెనీల ఏర్పాటుతో నష్టం వాటిల్లుతోందని, కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలన్నారు. ఐటీ పరిశ్రమ, కంపెనీలు మంజూర్ చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, ఎంపీపీ విజయ్‌కుమార్, జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


తాండూరు: ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


కొడంగల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

క్రైం కార్నర్

ఇసుక డంపులు సీజ్

దోమ, మార్చి 6: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేసి ఇసుక డంపింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ పురుషోత్తం, ఎస్సై ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని బుద్లాపూర్, హుస్సేన్‌నాయక్ తండాల్లో 18 ట్రాక్టర్‌ల ఇసుక డంపులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


డంపింగ్ ఇసుకను సీజ్ చేస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వీధిదీపాల మరమ్మతు

బొంరాస్‌పేట్, మార్చి 6: 'చిమ్మ చీకట్లో మండల కేంద్రం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని వీధుల్లో విద్యుత్ దీపాలను పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య విద్యుత్ సిబ్బందితో మరమ్మతు చేయించారు. విద్యుత్ సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కొడంగల్ సర్కిల్ ఎక్సైజ్ సీఐగా వెంకటేశం

కొడంగల్, మార్చి 6: కొడంగల్ సర్కిల్ ఎక్సైజ్ నూతన సీఐగా వెంకటేశం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ సీఐగా విధులు నిర్వహించిన ఆయన కొడంగల్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన సైదులు నల్గొండ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారిగా బదిలీపై వెళ్లారు. గుడుంబా, గంజాయి, అక్రమ మద్యం రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


సీఐ వెంకటేశం

గణిత అవధానికి డాక్టరేట్

తాండూరు, మార్చి 6: యాలాల మండలంలోని కూకట్ గ్రామానికి చెందిన ప్రముఖ గణిత అవధాని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రిటైర్డ్ హెచ్ఎం అనంతప్ప యాదవ్‌కు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన సభలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇండియన్ బోర్డు చైర్మన్ డాక్టర్ హెచ్ఆర్ రెహమాన్, కార్యదర్శి పరంజిత్‌సింగ్ పాల్గొన్నారు. విద్య, శిక్షణ విభాగంలో కృషి చేసినందుకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.


డాక్టరేట్ అందుకుంటున్న అనంతప్ప

స్టేట్ హజ్ కమిటీ సభ్యురాలిగా కౌన్సిలర్ ఫైముదాబేగం

వికారాబాద్, మార్చి 6 : తెలంగాణ స్టేట్ హజ్ కమిటీలో అధికార పార్టీకి చెందిన మునిసిపల్ కౌన్సిలర్‌కు చోటు లభించింది. వివిధ కేటగిరీల్లో సభ్యులను నియమించగా, వారిలో రాజీవ్ నగర్ కౌన్సిలర్ ఫైముదా బేగం రాష్ట్ర హజ్ కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 6: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి నీటి సరఫరా జరగాలని, ప్రతీ 10రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. పైపులైన్‌ల లీకేజీలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించాలని సూచించారు. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం, ఎంపీవో కరీం, భాగ్య పాల్గొన్నారు.

పరిగి: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్‌లో బుధవారం ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పైపులీకేజీలు ఉంటే బాగు చేయించాలని సూచించారు. ట్యాప్‌లకు ఆన్‌ఆఫ్ లేకుంటే సరి చేయాలన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తగా బోర్లుగానీ, పైపులైన్‌గానీ వేసే అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో దయానంద్, మిషన్‌భగీరథ ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడలేదు

ఘట్‌కేసర్, మార్చి 6: తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని సహకార సంఘం ఉపాధ్యక్షుడు బద్దం అనంతరెడ్డి, అతని కుమారుడు బద్దం నర్సింహారెడ్డి తెలిపారు. పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పోచారం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 36లోని శ్రీనివాసనగర్‌లో 2003వ సంత్సరంలోనే పట్టాదారు పాసుపుస్తకాలు పొందినట్లు తెలిపారు. 20ఏళ్ల తర్వాత తప్పుడు వివాదాలు సృష్టించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాము 2020లో భూమికి ప్రొసిడింగులు పొందినట్లు చెప్పడం సరికాదన్నారు. తాము ఎలాంటి ఫోర్జరీ డ్యాకుమెంట్లు సృష్టించలేదన్నారు. రాజకీయ కక్షతో తప్పుడు ఆరోపణలు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని అన్ని విషయాలు విచారణలో బయటపడతాయన్నారు.

మహిళలు ప్రణాళికతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ఎల్‌టీఐ మైండ్‌ట్రీ అసోసియేట్ డైరెక్టర్ త్రివేణి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 6: మహిళలు ప్రణాళికతో ముందుకు సాగాలని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ అసోసియేట్ డైరెక్టర్ త్రివేణి బొంతు అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎల్‌టీఐ మైండ్ ట్రీ అసోసియేట్ డైరెక్టర్ త్రివేణి బొంతు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా, రిజిష్ట్రార్ బాలాజీ ఉట్ల, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భోజన వసతి


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఎంపీడీవో గ్యామా, ఎంపీవో

కీసర, మార్చి 6: జీనీయా ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే పారిశుధ్య కార్మికులకు భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమని ఎంపీడీవో గ్యామా, ఎంపీవో వినూత్న అన్నారు. ఈ సందర్భంగా జీనీయా ఆసుపత్రి చైర్మన్ మన్యం సుబ్రమణ్యంను కీసరగుట్టలో శాలువాతో సత్కరించి సన్మానించారు. 16 క్వింటాళ్ల బియ్యం, వంట సామగ్రితో పాటు, చెత్తాచెదారం వేయడానికి 75 డ్రమ్ములు అందజేశారు. అదేవిధంగా పోలీస్ శాఖ వారికి ఐదు క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా లక్ష లడ్డూ కవర్లు, రూ.10లక్షలతో ఆలయానికి షెడ్డు, కీసర గ్రామపంచాయతీ కార్యాలయానికి పారిశుధ్య నిర్వహణకు రెండు ట్రాక్టర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీనీయా ఆసుపత్రి ప్రతినిధులు, ఎమ్ పవర్ సంస్థ ప్రతినిధులు, వినాయక మైనింగ్ ప్రతినిధులు, జూపల్లి సురేందర్, సెల్వరాజు, కందాడి హనుమంత్‌రెడ్డి, బొబ్బిలి శ్రీనాథ్‌రెడ్డి, కందాడి రాజిరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ తై బజార్ వేలం

కీసర రూరల్, మార్చి 6: దమ్మాయిగూడ తైబజార్ వసూలు చేసే హక్కులను చింత అనురాధ దక్కించుకున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, పలువురు కౌన్సిలర్ల సమక్షంలో బుధవారం తై బజార్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చింత అనురాధ, కృష్ణారెడ్డి, నరేష్, రఫీలు పాల్గొన్నారు. రూ.24.16లక్షలకు చింత అనురాధ తై బజార్ వసూలు చేసే హక్కులను దక్కించుకున్నారు. ఈ సంవత్సరం మే 1 నుంచి వచ్చే సంవత్సరం మార్చి-31 వరకు తై బజార్ వసూలు హక్కులను ఆమె పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న దొంగలు

● పొలాల్లో బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీ ● ఆందోళనలో రైతన్నలు

బషీరాబాద్, మార్చి 6: వ్యవసాయ పంట పొలాల్లోని బోరు మోటర్ల కేబుల్ వైర్లు చోరీకి గురవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలోపే రెండుసార్లు కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోపడ్డారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం ఘటనాస్థలానికి రాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. బషీరాబాద్ మండలం గంగ్వార్ శివారులో ఇద్దరి రైతుల పొలాలను మైల్వార్‌కు చెందిన మున్నూర్ భీంరెడ్డి కౌలుకు వేసుకుని వరిసాగు చేస్తున్నాడు. మరోరైతు హన్మప్ప వేరొకరి పొలాన్ని కౌలు వేసుకుని పంటసాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం రైతు భీంరెడ్డి పొలం వద్దకు రాగా మూడు మోటార్ల కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. సుమారు 200 మీటర్ల మేర కేబుల్ వైరు చోరీకి గురైంది. మరోరైతు కుమారుడితో కలిసి ఘటన స్థలం నుంచి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులు గడిచినా ఘటనా స్థలానికి పోలీసులు రాకపోవడంతో రైతన్నలకు మింగుడుపడటంలేదు. కేబుల్ వైర్ల చోరీతో పంట పొలాలకు నీరుపెట్టలేక, మళ్లీ దొంగలు చోరీకి పాల్పడతారెమోనని రైతులు సతమతమవుతున్నారు. పంట పొలాల్లోని బోరు మోటార్ల కేబుల్ వైర్ల దొంగల బెడద ఎక్కువవడంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


గంగ్వార్ శివారులో బోరు మోటార్ స్టార్టర్ వద్ద దిక్కుతోచని స్థితిలో రైతులు

విద్యుత్ అక్రమ కనెక్షన్లను తొలగించాలి

ధారూరు, మార్చి 6: మండలంలోని తరిగోపులలో విద్యుత్ అక్రమ కనెక్షన్లను తొలగించాలని ఎంపీడీవో నర్సింలు అన్నారు. ఈ మేరకు కొత్త విద్యుత్ మీటర్లు మంజూరు చేసి బిగించాలని ట్రాన్స్ కో ఎఈ వేణుగోపాల్ రెడ్డికి సూచించామని తెలిపారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి తరిగోపుల గ్రామాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. గ్రామంలోని ఓ కాలనీలో ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుకోవటాన్ని గుర్తించామని ఆయన చెప్పారు. గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరాను ఉచితంగా అందిస్తున్నందున అక్రమ కనెక్షన్లు ఉండరాదన్నారు. విద్యుత్ మీటర్లు పెట్టుకోవాలని ఆయన వారికి సూచించారు. చాలా గ్రామాల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు కనిపిస్తున్నాయని ఆయన వివరించారు. ఇలాంటి కనెక్షన్లను తొలగించి విద్యుత్ మీటర్లు బిగించాలని ఆయన ట్రాన్స్‌కో ఎఈ వేణుగోపాల్‌రెడ్డికి సూచించారు. ఎంపీడీవో వెంట ఈజీఎస్ ఏపీవో సురేస్, ట్రాన్స్‌కో ఎఈ వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.


తరిగోపులలో పర్యటిస్తున్న ఎంపీడీవో నర్సింహులు

పరీక్షా కేంద్రాల పరిశీలన


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో

మేడ్చల్ టౌన్, మార్చి 6: మేడ్చల్ మండలంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈవో వసంతకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సారి మండలంలో అదనంగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు రాయటానికి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేయడంతో పాటు పాఠశాలల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** కుసుమ సముద్రం ప్రాథమి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పొలినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతడికి పీఆర్‌టీయూలో సభ్యత్వం ఉండగా స్పందించిన రాష్ట్ర శాఖ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, అమర్‌నాథ్ బుధవారం బాధిత కుటుంబానికి ఆ చెక్కును అందజేశారు.

● **పరిగి:** విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా పరిగి మున్సిపల్ పరిధితోపాటు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

● **దోమ:** దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం చైల్డ్ ఎడ్యూకేషన్ బాలికల సాధికారత అనే కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● **శామీర్‌పేట:** ప్రజాపాలన సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. తూంకుట మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన ఎంటర్‌లో కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్ పాల్గొన్నారు.

● **ధారూరు:** జాతీయ ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకు పని ప్రదేశంలో సురక్షితమైన తాగునీటి సౌకర్యం గ్రామ పంచాయతీల ద్వారా కల్పిస్తామని ఎంపీడీవో నర్సింలు తెలిపారు.

● **మోమిన్‌పేట్:** మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వైద్యులు ధనలక్ష్మి, ప్రమోద్, ఎస్ఐ అరవింద్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● **కొడంగల్:** స్థానిక నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో బుధవారం లీడ్ ఇంగ్లీష్ కాన్ఫరెన్స్ మేళా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఇంగ్లీష్, సైన్స్, గణిత పరికరాలు, చార్ట్స్, ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు.

● **కొడంగల్ రూరల్:** బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పని చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కలిసి పోటీచేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు బీఎస్పీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మదా కిష్టప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **శామీర్‌పేట:** పవిత్ర హాజ్‌యాత్ర కమిటీ నూతన సభ్యుడిగా శామీర్‌పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముజీబుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. హాజ్ యాత్రకు వెల్లే భక్తులకు తాను బాధ్యతగా ఉత్తమ సేవలందిస్తానని తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కార్మికులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన మహిళా కార్మికులకు డీఎం సుధాకర్ బహుమతులు, గుర్తింపు పత్రాలు అందజేశారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేటలోని గాంధీ విగ్రహం వద్ద ఈఎంఆర్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి హాజరై ప్రారంభించారు.

● **పరిగి:** సాఫ్ట్‌లైన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గల నెలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ముగ్గురు విద్యార్థులు వల్లభ, జయదీప్, ఫర్‌హినాలకు ప్రతిభ కనబరిచారు. వారిని పరిగి సీఐ ఎస్ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, హెచ్ఎంలు గోపాల్, శంకర్, బి.అంజనేయులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** పదోతరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని దామర్‌చెడ్ అంబాభవానీ మాత దేవాలయం ఆలయ పీఠాధిపతి శ్రీ శంకర్ స్వామిజీ అన్నారు. నవాల్గ జీడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. బాసర సరస్వతీమాత ఆలయంలో పూజింపబడిన పెన్నులను విద్యార్థులకు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.